RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ గురువారం 26.02.2026 సంపుటి : 03 సంచిక : 83 పేజీలు : 08 వెల : రూ.5

తెలుగు దినపత్రిక

Karimnagar Thursday 26.02.2026 Volume: 03 Issue 83 Pages 08 Cost 5/


## శ్రీనివాస్‌రెడ్డి పదవీకాలం పొడిగింపు

### మీడియా అకాడమీ చైర్మన్‌గా మరో రెండేండ్లు..



**హైదరాబాద్, ఫిబ్రవరి 25 :** తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా వ్యవ హరిస్తున్న సీనియర్ సంపాదకులు కే శ్రీనివాస్ రెడ్డి పదవీకాలాన్ని ప్రభుత్వం మరో రెండేండ్లపాటు పొడిగించింది. ఈ మేరకు బుధ వారం ఉత్తర్వులు జారీచేసింది. 2024 ఫిబ్రవరి 26న రెండేండ్ల కాలానికి మీడియా అకాడమీ చైర్మన్‌గా శ్రీని వాస్‌రెడ్డిని ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. మంగళవారంతో ఆయన పదవీకాలం ముగిసిన నేపథ్యంలో మరో రెండేండ్లపాటు పొడగించింది.

# న్యాయవ్యవస్థపై ప్రణాళికాబద్ధమైన దాడి



**8వ తరగతి పిల్లలకు 'న్యాయవ్యవస్థలో అవినీతి'పై పాఠమా?**

**సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఫైర్**

**వ్యవస్థ సమగ్రతను దెబ్బతీయడాన్ని ఈ భూమ్మీద ఎవరినీ అనుమతించను**

**ఎలా డీల్ చేయాలో నాకు బాగా తెలుసు..**

**ఇప్పటికే ఆదేశాలిచ్చా.. సుమోటోగా తీసుకుంటున్నా**

**చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరిక నేడు సుమోటోగా విచారణ!**

**తక్షణమే స్పందించిన ఎన్‌సీఈఆర్‌టీ**

**వెబ్‌సైట్ నుంచి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకం తొలగింపు**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25 :** జాతీయ విద్యాపరిశోధన–శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) 8వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలో అవినీతి'ని పాఠంగా చేర్చడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇది జ్యుడీషియరీపై ప్రణాళికాబద్ధమైన, లోతైన దాడిగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అభివర్ణించారు. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఈ భూమ్మీద ఎవరినీ అనుమతించనని తేల్చిచెప్పారు. న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి సాంఘిక శాస్త్రం కొత్త పాఠ్యపుస్తకంలో పొందుపరచింది. న్యాయవ్యవస్థలో అవినీతి, భారీగా పెండింగ్ కేసులు, న్యాయాధికారులు/ న్యాయమూర్తుల కొరతను కూడా అందులో ప్రస్తావించింది. 'మన సమాజంలో న్యాయవ్యవస్థ పాత్ర' పేరుతో ఈ అధ్యాయాన్ని చేర్చింది. గత సంచికల్లో న్యాయవ్యవస్థ, కోర్టుల పాత్ర వరకే పరిమితం కాగా.. సోమవారం విడుదల చేసిన నూతన పాఠ్యపుస్తకంలో కోర్టుల వ్యవస్థ, న్యాయం ఎంతవరకు అందుతోంది.. అనే అంశాలపై విస్తృతంగా చర్చించారు. అదే సమయంలో న్యాయవ్యవస్థలో అవినీతి, ఆర్థికంగా బలహీన వర్గాలకు న్యాయం అందించడంలో దాని ప్రభావం గురించి వివరించారు. ఈ అంశాన్ని సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మనుసింఘ్వీ బుధవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎస్. పంచోలితో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. ఆ పాఠ్యపుస్తకంలోని సదరు అధ్యాయం అవమానకరంగా ఉందని.. ఆ పుస్తకం ప్రతులు తమ వద్ద ఉన్నాయని సిబల్ తెలిపారు. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకంలో 8వ తరగతి పిల్లలకు న్యాయవ్యవస్థలో అవినీతిని నేర్పిస్తుండడం చూసి ఈ వ్యవస్థలో సభ్యులుగా ఆందోళన చెందుతున్నామన్నారు.న్యాయవ్యవస్థలో మాత్రమే అవినీతి ఉన్నట్లు పేర్కొన్నారని.. రాజకీయ నాయకులు, మంత్రులు, బ్యూరోక్రాట్లు, ఇతరుల గురించి ఒక్క మాట కూడా లేదని.. ఇది తమను కలవరపరుస్తోందని సింఘ్వీ అన్నారు. దీనిపై చీఫ్ జస్టిస్ స్పందించారు. 'ఇది కచ్చితంగా మొత్తం వ్యవస్థను, అందులోని భాగస్వాములను ఆందోళనకు గురిచేస్తోంది. ఒక్క రోజు ఆగండి. ఇప్పటికే నేను సుమోటోగా ఈ వ్యవహారాన్ని పరిగణనలోకి తీసుకున్నాను. ఆదేశాలు కూడా ఇచ్చాను. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను, సమగ్రతను దెబ్బతీయడానికి ఈ భూమ్మీద ఏ ఒక్క వ్యక్తినీ అనుమతించే ప్రసక్తే లేదు. ఏ పరిస్థితుల్లోనూ ఇందుకు అను మతించను. ఈ వ్యవహారం ఎంత దూరం వెళ్లినా.. చట్టం తన పని తాను చేసుకు పోతుంది. దీనినెలా డీల్ చేయాలో నాకు బాగా తెలుసు' అని సీజేఐ తేల్చిచెప్పారు. ఇది చాలా ప్రణాళికాబద్ధమైన, లోతైన దాడిగా కనిపిస్తోందన్నారు.

### వెబ్‌సైట్ నుంచి 'పాఠ్యపుస్తకం' మాయం

సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం నేపథ్యంలో ఎన్‌సీఈఆర్‌టీ తక్షణమే స్పందించింది. తన వెబ్‌సైట్ నుంచి 8వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్య పుస్తకాన్ని తొలగించింది. అందులోని న్యాయవ్యవస్థ తాలూకు వివాదాస్పద అంశాలను కూడా తొలగించాలని జాతీయ మండలి యోచిస్తోందని కేంద్రప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఎన్‌సీఈఆర్‌టీ స్వతంత్ర సంస్థ అని.. పాఠ్యపుస్తకాల్లో అధ్యాయాలను చేర్చేటప్పుడు దాని అధికారులు బుర్రపెట్టి ఉండాల్సిందని కేంద్రప్రభుత్వ వర్గాలు వ్యాఖ్యానించాయి

## భారత్‌కు చావోరేవో

### నేడు జింబాబ్వే పోరు



**చెన్నై:** టీ20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ కఠిన పరిస్థితులను ఎదుర్కొంటున్నది. సెమీఫైనల్ బెర్తు దక్కించుకోవాలంటే తప్పక గెలువాల్సిన స్థితిలో టీమ్‌ఇండియా కొట్టుమిట్టాడుతున్నది. ఇప్పటికే దక్షిణాఫ్రికా చేతిలో భారీ ఓటమితో సెమీస్ అవకా శాలను క్లిష్టం చేసుకున్న సూర్య కుమార్ యాదవ్ సేన..గురువారం జింబాబ్వేతో కీలక పోరులో తలపడనుంది. మెగా టోర్నీలో ముందంజ వేయాలంటే మిగతా జట్ల గెలుపు, ఓటములపై ఆధారపడాల్సిన పరిస్థితి కొని తెచ్చుకున్న టీమ్ఇండియా ముందంజ వేయాలంటే పోరాడాల్సి ఉంది. పొట్టి ఫార్మాట్‌లో ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేస్తూ డిఫెండింగ్ చాంపియన్‌గా ప్రపంచకప్‌లో అడుగుపెట్టిన భారత్ అంచనాలకు తగ్గట్లు రాణించలేకపోతున్నది.మెగా టోర్నీకి ముందు మన బ్యాటర్లు పరుగుల వరద పారిస్తూ భారీ స్కోర్లు నమోదు చేయగా, ప్రస్తుతం ఘోరంగా తడబడుతున్నారు. అలవాటైన సొంత ఇలాఖాలో పిచ్‌లపై పరుగులు సాధించడంలో ఆపసోపాలు పడుతున్నారు.

## ఇజ్రాయెల్ పర్యటనకు ప్రధాని మోదీ

**ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం పెంపే లక్ష్యం**



భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పర్యటనకు బయల్దేరారు. ఆయన ఇజ్రాయెల్‌లో రెండు రోజలపాటు పర్యటిస్తారు. దీనికోసం బుధవారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో ఇజ్రాయెల్ బయల్దేరారు. ఇది ప్రధానిగా ఇజ్రాయెల్‌కు రెండో పర్యటన. చివరగా 2017లో మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఈ పర్యటన ఉపయోగపడనుంది.ఈ పర్యటన సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో సమావేశమవుతారు. ఇది నెతన్యాహు ఆహ్వానం మేరకు సాగుతున్న పర్యటన. రక్షణ, వ్యవసాయం, కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీ, వ్యాపారం, పెట్టుబడులు, వాటర్ మేనేజ్‌మెంట్, కల్చరల్ ఎక్స్ఛేంజ్ వంటి అంశాల్లో ఇరు దేశాల మధ్య ఒప్పందాలు కుదరనున్నాయి.

## యూట్యూబర్ అన్వేష్‌పై లుకౌట్ నోటీసులు



**హైదరాబాద్ :** నా అన్వేషణ ఫేమ్, ప్రముఖ యూట్యూబర్ అన్వేష్‌పై పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. గత ఏడాది పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నటి కరాటే కళ్యాణి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. సోషల్ మీడియా వేదికగా అన్వేష్ హిందూ దేవతలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని, భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా అసభ్యకరంగా వీడియోలు విడుదల చేశారని కరాటే కళ్యాణి సదరు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలోనే అప్పట్లోనే ఆయనపై కేసు నమోదు చేసిన పోలీసులు, తాజాగా దర్యాప్తును వేగవంతం చేశారు. విశాఖపట్నానికి చెందిన అన్వేష్ ప్రస్తుతం విదేశాల్లో ఉంటూ తన యూ ట్యూబ్ ఛానల్‌ను నిర్వహిస్తున్నారు. ఆయన దేశం వెలుపల ఉండటంతో విచారణ నిమిత్తం పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. దీనివల్ల ఆయన ఏ విమానాశ్రయంలో దిగినా విమానాశ్రయ అధికారులు వెంటనే గుర్తించి పోలీసులకు సమాచారం అందించే అవకాశం ఉంటుంది.

## 'ఆపరేషన్ క్రాక్‌డౌన్'కు శ్రీకారం:డీజీపీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 25 :** సైబర్ క్రైం మోసాలకు చెక్ పెట్టేందుకు కీలక నిర్ణయం తీసుకున్నట్టు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆపరేషన్ క్రాక్‌డౌన్‌కు శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. ఈ ఆపరేషన్ బుధవారం నుంచే అమల్లోకి వచ్చినట్టు తెలిపారు. బుధవారం నిర్వహించిన ఆపరేషన్‌లో 16 జిల్లాల్లో 137 బ్యాంకుల్లో 1,888 అనుమానాస్పద అకౌంట్లను గుర్తించినట్టు తెలిపారు. గోదావరి పుష్కరాలకు పటిష్ఠ భద్రత కల్పించాలని ఆయా జిల్లాల పోలీసు అధికారులను రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్‌తో కలిసి వివిధ జిల్లాల పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తెలంగాణ పోలీస్ శాఖ అతిథ్యమిస్తున్న 74వ బీఎన్ ముల్లిక్ మెమోరియల్ ఆలిండియా పోలీస్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్–2026 ఏర్పాట్లపై డీజీపీ శివధర్‌రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.





# యువత రాజకీయాల్లో కీలకం కావాలి

**కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి**
**ఇందిరమ్మ ఇండ్లకు రాజకీయ జోక్యం ఉండదు**
**మార్చి 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోండి**
**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



**జనోదయ, వరంగల్ కార్పొరేషన్**

రానున్న రోజుల్లో యువతే రాజకీయాల్లో కీలక భూమిక పోషించాలని, క్షేత్ర స్థాయి నుంచే పార్టీ పునర్నిర్మాణం చేపట్టాలని యువతకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.అందరూ కలిసికట్టుగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి పాటు పడాలని కోరారు.నియోజకవర్గ పరిధిలో సుమారు 100 మంది యువకులు స్వచ్ఛందంగా కాంగ్రెస్ నాయకులు పల్లె రాహుల్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారికి కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

**ఇందిరమ్మ ఇండ్లకు రాజకీయ జోక్యం ఉండదు...**

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తామని, అర్హతే ఒక్కటే ప్రమాణమని, రాజకీయ అనుబంధాలు పరిగణనలోకి తీసుకోబోమని ఎమ్మెల్యే తెలిపారు.దరఖాస్తుల స్వీకరణ కోసం బాలసముద్రంలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బుధవారం నుంచి మార్చి 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, అర్హులైన లబ్ధిదారులు గడువు లోపు తమ అభ్యర్థనలు సమర్పించాలని కోరారు. దరఖాస్తుల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మా సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రతి డివిజన్‌లో కార్పొరేటర్లు కూడా ప్రజలకు అవసరమైన సహకారం అందించాలని ఎమ్మెల్యే సూచించారు. అర్హులైన ఒక్కరూ కూడా పథకం లబ్ధి నుండి దూరం కాకుండా సమన్వయంతో చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలి

**వంద శాతం ఫలితాలు సాధించాలి**
**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



**జనోదయ, హనుమకొండ, ఫిబ్రవరి 25:**

హనుమకొండ జిల్లా కాజీపేట మండలం రాంపూర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వార్షిక పరీక్షల సమీపిస్తున్నాయని, విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు సంబంధించి పూర్తిస్థాయిలో సన్నద్ధత కావాలని అన్నారు. వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి విద్యార్థులు బాగా చదవాలనని, విద్యార్థులను చదువుల్లో మరింత ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదేవిధంగా పాఠశాలకు సంబంధించి కిచెన్ షెడ్డును పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం ఏం వండుతున్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది విద్యార్థులకు వంట చేశారని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, తహసిల్దార్ రాజు, ఎంఈవో మనోజ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనం కేసులో నిందితుడు అరెస్ట్

**జనోదయ, హనుమకొండ :** హనుమకొండ జిల్లా, ఎల్కతుర్తి మండలంలోని దామెర గ్రామంలో ఈ నెల 18న జరిగిన పట్టపగలు దొంగతనం కేసును పోలీసులు వేగంగా ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు.దామెర గ్రామానికి చెందిన ఆవుల సంపత్ ఇంటి తాళం పగుల గొట్టి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి నగదు అపహరించినట్లు బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చెయ్యగా దీనిపై కేసు నమోదు చేసిన స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఏ.ప్రవీణ్ కుమార్ దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో మంగళవారం సాయంత్రం ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా పోలీసులు కనిపించగానే ఎఫ్ జెడ్ బైక్‌పై ఒక వ్యక్తి అనుమానాస్పదంగా పారిపోవడానికి ప్రయత్నించాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతడిని పట్టుకుని విచారించగా అతనిది వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామం నివాసి బెల్లి సందీప్ అని తెలిపాడు.విచారణలో దామెర గ్రామంలో జరిగిన దొంగతనం నేరాన్ని అతను ఒప్పుకున్నాడు. అతని వద్ద నుండి రూ. 47,000 నగదు స్వాధీనం చేసుకుని నేరానికి ఉపయోగించిన ఎఫ్ జెడ్ బైక్‌ను సీజ్ చేశారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన ఎస్సై ఏ.ప్రవీణ్ కుమార్ హెడ్ కానిస్టేబుల్ బి. విటల్ రావు కానిస్టేబుల్లు బక్కయ్య రంజిత్ సుమన్ అఖిల్‌లను సర్కిల్ ఇన్స్పెక్టర్ పులి రమేష్ అభినందించారు.










# గంగారం పెద్ద చెరువును సందర్శించిన హైడ్రా కమిషనర్

**-అభివృద్ధికి సానుకూల స్పందన..**
**కసిరెడ్డి సింధూ రెడ్డి**

**జనోదయ : శేరిలింగంపల్లి :**

చందానగర్ పరిధిలోని గంగారం పెద్ద చెరువు అభివృద్ధి అంశంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించి చెరువును స్వయంగా సందర్శించడం హర్షించదగ్గ పరిణామం అని చందానగర్ కాంటెస్టెడ్ కార్పొరేటర్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కసిరెడ్డి సింధూ రెడ్డి పేర్కొన్నారు. గంగారం పెద్ద చెరువులో పెరుగుతున్న కాలుష్యం, దోమల సమస్యలు, అభివృద్ధి పనులు కుంటుపడుతున్న అంశాలపై తేది 2026 ఫిబ్రవరి 21న స్థానికులతో కలిసి ఆమె నిరసన ధర్నా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హైడ్రా అధికారులు వేగంగా స్పందించి చెరువును సందర్శించడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కసిరెడ్డి సింధూ రెడ్డి మాట్లాడుతూ.. ఎఫ్‌టీఎల్ (ఎఫ్ టి ఎల్) గుర్తింపు ప్రకారం గంగారం పెద్ద చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి, చెరువు పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరారు. కాలుష్య నివారణ, దోమల నిర్మూలన, చెరువు చుట్టూ పారిశుధ్య మెరుగుదల వంటి అంశాలలో తక్షణ చర్యలు అవసరమని ఆమె స్పష్టం చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈ అంశాలపై సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గంగారం పెద్ద చెరువు అభివృద్ధి పనులు వేగవంతం అయితే పరిసర ప్రాంత ప్రజలకు పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్య భద్రత కూడా కలుగుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీలు, అపార్ట్మెంట్ వాసులు, హైడ్రా, రెవెన్యూ, సిఏంసి, అధికారులు పాల్గొన్నారు.



# సింగరేణిలో సిఎంపిఎఫ్ ఆధ్వర్యంలో 'ప్రయాస్'

జనోదయ, గోదావరిఖని, ఫిబ్రవరి 25:



సింగరేణి ఆర్జీ.1 జియం కార్యాలయం సమావేశ హాలు నందు సింగరేణి సిఎంపిఎఫ్ ఆధ్వర్యంలో 6వ "ప్రయాస్" అనే ప్రత్యేక కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల భవిష్య నిధి పెన్షన్ దావాలను తక్షణ పరిష్కారానికి సంబంధించి చురుకైన చర్యలు తీసుకోవడం ద్వారా జీరో పెండెన్సీ" సాధించడం ముఖ్య లక్ష్యంగా ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్-1 (రామగుండం) హరి పచౌరి, సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్-2 (రామగుండం) కె గోవర్ధన్ ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 100 రివైజ్డ్ పి.పి. ఓ ఆర్డర్స్‌ను జియం ఆర్జీ-1 లలిత్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా జియం తెలియజేస్తూ ఆర్జీ.1 ఏరియా ఉద్యోగులకు సంభంధించిన సిఎంపిఎఫ్ నెంబర్ అలాట్ మెంట్, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల క్లైమ్స్ త్వరితగతిన పూర్తీ చేయాలనీ కోరారు. ఈ సందర్భంగా సిఎంపి.ఎఫ్ రీజినల్ కమిషనర్-1 (రామగుండం) హరి పచౌరి మాట్లడుతూ సింగరేణి ఉద్యోగులకు సంభందించిన పెండింగ్ సియంపియఫ్ కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్య దళారుల ప్రమేయం లేకుండా సీఎంపీఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చునని తెలిపారు. సిఎంపిఎఫ్ కు సంబధించి ఏదేని పెండింగ్ ఉన్నచొ గనుల సంక్షేమాదికారులను సంప్రదించాలని తెలిపారు. క్లెయిమ్‌ల తక్షణ పరిష్కారం చేయాలనీ అలాగే మార్చి నెల చివరలో అందరు కూడా పెన్షన్ కొరకు జీవన్ ప్రమాణ్ చేయాలని తెలిపారు. ఈ సందర్బంగా ఈ నెల చివర లో పదవీ విరమణ పొందనున్న సిఎంపి ఎఫ్ రీజినల్ కమిషనర్-1 (రామగుం డం) హరి పచౌరిను జియం లలిత్ కుమార్, పర్సనల్ అధికారులు శాలు వాలతో సన్మానించి జ్ఞాపికను అంద జేసి వారి శేష జీవితం సుఖ శాంతుల తో, ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యా లతో ఉండాలని కోరారు.

ఈ సమావేశంలో యస్.ఓటు జియం చంద్ర శేఖర్, డి.జి.యం. ఫైనాన్స్ ధనలక్ష్మీభాయ్,పర్సనల్ అధికారులు వేణు, శ్రావణ్ కుమార్, హన్మంతరావు, ఫిరోజ్ ఖాన్, గనుల సంక్షేమ అధికారులు గణేష్, నిహాల్ సాయి, నాగరాజు, అకౌంట్స్ ఆఫీసర్ రజిని సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ ఎంపీ డా.కడియం కావ్యకి

# అంతర్జాతీయ పార్లమెంటరీ బాధ్యత

**ఇండియా -సౌదీ అరేబియా పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్ సభ్యురాలిగా ఎంపిక**

జనోదయ, హనుమకొండ, ఫిబ్రవరి 25:



వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యకి అరుదైన గౌరవం దక్కింది. ఇటీవల ఏర్పాటు చేసిన ఇండియా-సౌదీ అరేబియా పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్ సభ్యు రాలిగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యని,లోక్‌సభ స్పీకర్ నామినేట్ చేశారు. ఈ మేరకు లోక్ సభ సెక్రటేరియట్ (కాన్ఫరెన్స్ అండ్ ప్రోటోకాల్ బ్రాంచ్) అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. భారతదేశం - సౌదీ అరేబియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపే తం చేయడం, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో సహ కారాన్ని విస్తరించ డమే లక్ష్యంగా ఈ పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్‌ను ఏర్పా టు చేశారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ,ఈ బాధ్యత తనకు అప్పగించినందుకు లోక్‌సభ స్పీకర్‌కి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కృతజ్ఞతలు తెలిపారు. భారత్- సౌదీ అరేబియా మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా పార్ల మెంటరీ స్థాయిలో తన వంతు కృషి చేస్తానని ఎంపీ స్పష్టం చేశారు. ఈ నామినేషన్ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి గర్వ కారణమని, అంతర్జాతీయ పార్లమెంటరీ వేదికపై తెలంగాణకు మరింత గుర్తింపు తీసుకువస్తుందని ఎంపీ అభిప్రాయ పడ్డారు.

# కారులో కొట్లాట

## రామగుండంలో బీఆర్ఎస్ వర్సెస్ బీఆర్ఎస్

**- తారస్థాయికి చేరిన గ్రూపు తగాదాలు**

**- సోషల్ మీడియా వేదికగా ఒకరిపై ఒకరు దుమ్మెతి పోసుకుంటున్న వైనం**

**- అదిష్టానం వద్దకు చేరుకున్న పంచాయితీ**

(జనోదయ-గోదావరిఖని)



రాజకీయాల్లో అధికార, విపక్షాలు మాటల, చేతల యుద్దాలు చేసుకోవడం చూశాం. కానీ రామగుండంలో ఒకే పార్టీకి చెందిన నాయకులు మాటల యుద్ధం చేస్తూ ఒకరిపై ఒకరు దుమ్మెతి పోసుకుంటున్నారు. దీంతో గ్రూపు తగాదాలు తారాస్థాయికి చేరినట్టు కనబడుతుంది. దీనికి కారణం ఇటీవల జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ టికెట్ల లొల్లి అని తెలుస్తుంది.

రామగుండం బీఆర్ఎస్‌లో మొత్తం మూడు గ్రూపులు చాలామణిలో ఉన్నాయి. ఇందులో ఇద్దరు నేతలు కలిసిపోయి ఒక గ్రూపుగా మారారు. మరో నేత మాత్రం సపరేట్ గ్రూప్‌ను నడుపుతూ సపరేట్‌గా ఉంటున్నారు. ఈ మధ్య కాలంలో రామగుండం వచ్చిన సదరు నేత కార్యకర్తలను తన వైపు మలుపుకుంటున్నారు. వేర్వేరుగా కార్యక్రమాలు చేస్తున్నారు. సదరు నేతకు అధిష్టానం దగ్గర కూడా కొంత మేరకు పలుకుబడి ఉన్నట్టు తెలుస్తోంది.అయితే ఇటీవల జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ఆ సపరేట్ నేత వర్గీయులకు ఒక్కటంటే ఒక్క టికెట్ కూడ ఇవ్వకపోవడం అగ్నికి ఆజ్యం పోసినట్టు అయ్యింది. దీంతో ఆ వర్గం నేత అను చరులు సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఇది పార్టీ ఫండ్ లెక్కలు అడిగే స్థాయికి చేరింది.

దీనిపై ఒకరిపై ఒకరు ఇప్పటికే అధిష్టానికి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ప్రస్తుతం ఈ లొల్లి అధిష్టానం కోర్టులో ఉంది. ఇప్పటికైనా హైకమాండ్ స్పందించి ఈ లొల్లిని పరిష్కరించాలని కార్యకర్తలు కోరుతున్నారు.

# ఈర్ల చెరువు పరిరక్షణకు చర్యలు వేగవంతం చేయాలి

**హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కలిసి పరిశీలించిన..మిద్దెల మల్లారెడ్డి**




జనోదయ శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 25 :

మదీనాగూడ డివిజన్ పరిధిలోని ఈర్ల చెరువును హైడ్రా కమిషనర్ రంగనాథ్ సమగ్రంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకుడు మిద్దెల మల్లారెడ్డి పాల్గొని చెరువు పరిసరాల పరిస్థితిని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. చెరువు ఆక్రమణలు, మురుగునీటి ప్రవాహం, పరిసరాలలో పేరుకుపోయిన చెత్త వంటి సమస్యలను కమిషనర్‌కు వివరించారు. స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చెరువును శుభ్రపరచడం, ఆక్రమణలను తొలగించడం, భవిష్యత్తులో పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ..చెరువుల సంరక్షణ ప్రభుత్వ ప్రాధాన్యత అంశమని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెరువుల పరిరక్షణతో భూగర్భ జలాల స్థాయి మెరుగుపడటంతో పాటు పర్యావరణ సమతుల్యత కాపాడబడుతుందని పేర్కొన్నారు. మిద్దెల మల్లారెడ్డి మాట్లాడుతూ..మదీనాగూడ డివిజన్ అభివృద్ధిలో భాగంగా ఈర్ల చెరువును పునరుద్ధ రించడం అత్యవసరమని, ప్రజల సహకారంతో చెరువును శుభ్రంగా, ఆక్రమణల రహితంగా మార్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.







# ఇంటర్మీడియట్ పరీక్షలపై జిల్లా కలెక్టర్ తనిఖీ

## పకడ్బందీ ఏర్పాట్లకు ఆదేశాలు




**జనోదయ, జగిత్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 25**

బుధవారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా జగిత్యాల పట్టణంలోని ఎస్.కె.ఎన్.ఆర్ (బాలుర) ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో నిర్వహణ విధానం, ప్రశ్న పత్రాల భద్రత, హాల్‌టికెట్ల తనిఖీ ప్రక్రియలను జిల్లా కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పరీక్షా గదుల్లో సరిపడా వెలుతురు, తాగునీరు, శౌచాలయాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరీక్షా కేంద్ర పరిసరాల్లో 144 సెక్షన్ అమలు కచ్చితంగా ఉండాలని సూచించారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రంలోకి అనుమతించరాదని స్పష్టం చేస్తూ, సీసీ కెమెరాల పర్యవేక్షణ నిరంతరం కొనసాగాలని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తరచూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని కోరారు. పరీక్షా సిబ్బంది తమ విధులను నిబద్ధతతో నిర్వహించాలని, ఫిర్యాదులు వచ్చిన వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో ఒకే విధమైన ప్రమాణాలు పాటిస్తూ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలనలో డీఐఈవో నారాయణ, తహసీల్దార్ రామ్మోహన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఐటిఐలో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



**జనోదయ : మందమర్రి ఫిబ్రవరి 25:**

పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పిఎంకెవివై) 4.0 పథకం కింద మూడు నెలల షార్ట్ టైమ్ కోర్స్ అయినా ఎలక్ట్రికల్ వెహికల్ సర్వీస్ టెక్నీషియన్ శిక్షణ కొరకు దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ జి దేవానంద్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ తరగతులు మార్చి రెండు నుండి ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ ఎస్ఎస్సి మెమో, ఆధార్ కార్డ్, మెయిల్ ఐడి, ఫోన్ నెంబర్, పాస్పోర్టు సైజ్ ఫోటో, బ్యాంక్ ఖాతా నెంబర్ తో కళాశాలలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 7013846573, 9154549697 నందు సంప్రదించాలని తెలిపారు.

# నగర పాలక అభివృద్ధే ధ్యేయం



**జనోదయ : ఉమ్మడి ఆదిలాబాద్ :**

మంచిర్యాల నగర పాలక సంస్థ మేయర్ దర్ని మధుకర్ మంచిర్యాల నగర పాలక సంస్థ పరిధిలోని 10 వ డివిజన్, 30వ డివిజన్. 32 వ డివిజన్ పరిధిలో నగర పాలక కమిషనర్,వార్డు కార్పొరేటర్లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ పారిశుద్ధ రోడ్ల నిర్మాణం గురించి కమిషనర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.నగర పాలక సంస్థ అభివృద్దే మన ప్రధాన ధ్యేయం అని ఆ దిశగా పనులను జరిపించాలని రేపు స్పెషల్ డ్రైవ్ చేపట్టి పారిశుద్ధ్య పనులు డ్రైన్లు క్లీన్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మేయర్ తో పాటు కమిషనర్ అన్వేష్ 10 వ డివిజన్ కార్పొరేటర్ రాచకొండ గోపాల్ రావు 30వ డివిజన్ కార్పొరేటర్ కర్రె శ్రీనివాస్ నగర పాలక సిబ్బంది, ఆయా వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్



**జనోదయ : మంచిర్యాల, ఫిబ్రవరి 25:**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ లుగా ఎన్నికైన ధరణి మధుకర్, సల్ల రమ్య బుధవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేశారు.

# సింగరేణి బొగ్గు నిల్వలపై విచారణ జరిపించాలి

**జనోదయ : మందమర్రి ఫిబ్రవరి 25:**

సింగరేణిలో 2023 - 24, 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి గాను బొగ్గు నిల్వలపై సమగ్ర విచారణ జరిపి, తప్పుడు సమాచారం ఇచ్చిన అధికారులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షుడు మంద నరసింహ రావు డిమాండ్ చేశారు. ఈ విషయంపై సమగ్ర విచారణ నిర్వహించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి, కోల్ సెక్రటరీకి లేఖను పంపారు. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ, సింగరేణిలో బొగ్గు నిల్వలు సంవత్సరానికి ఒక మిలియన్ టన్ను లోపు ఉండాలి కానీ 2024 - 25 సంవత్సరానికి గాను దాదాపు 6 మిలియన్ టన్నులు అధికంగా 7 మిలియన్ టన్నులు చూపించారని తెలిపారు. దీంతో కంపెనీకి అదనంగా రాని లాభాన్ని చూపించినట్లు అయిందన్నారు. అధి కారుల తప్పుడు ధృవీకరణతో సింగరేణి డివిడెంట్లు, సెస్, డిఎంఎఫ్టి, సిఎస్ఆర్, ఇతర టాక్స్ ల రూపంలో అధిక మొత్తంలో నష్టపోయిందని తెలిపారు. రాని లాభాలు చూపించి, ఉన్నతాధికారులు పబ్బం గడపడానికి చేసిన ప్రయత్నం ఇదని ఆరోపించారు. దీంతోపాటు బొగ్గు నిల్వల లోటు పూడ్చడం సింగరేణికి ఇబ్బందికరమని తెలిపారు. సింగరేణి 2023 - 24, 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి గాను బొగ్గు నిల్వలపై సమగ్ర విచారణ జరిపి, తప్పుడు రిపోర్ట్ సమర్పించిన అధికారులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూడాలని కోరారు.



# బుయ్యారంలో గుడుంబా స్థావరాలపై దాడులు

**జనోదయ: ఉమ్మడి ఆదిలాబాద్ :**



మంచిర్యాల జోన్ పరిధిలోని నీల్వాయి పోలీస్ స్టేషన్ ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి మరియు చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది కలిపి సుమారు 40 మంది కలిసి బుయ్యారం గ్రామంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 20 గుడుంబా తయారీ కేంద్రాలను గుర్తించి దాడులు నిర్వహించి, సుమారు 5,000 లీటర్ల పులియబెట్టిన బెల్లం మిశ్రమం (గుడుంబా పానకం)ను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ గ్రామ ప్రజలతో మాట్లాడుతూ, అక్రమంగా గుడుంబా తయారీ మరియు విక్రయాలు చట్ట విరుద్ధమని తెలిపారు. అలాంటి కార్యకలాపాల్లో పాల్గొనవద్దని సూచించారు. గుడుంబా తయారీలో ఎవరైనా పాల్గొంటే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ,ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి, చెన్నూరు ఎక్సైజ్ సిఐ హరి, మంచిర్యాల డీటీఫ్ సీఐ సమ్మయ్య, చెన్నూరు ఎక్సైజ్ ఎస్సై రమణ, బెల్లంపల్లి ఎక్సైజ్ ఎస్సై శారద, సిబ్బంది పాల్గొన్నారు.